# గేయాల్నే వ్రాస్తాను

శ్రీదత్తప్రసాద్ పరమాత్ముని

పడుకున్నానన్న మాటేగానీ నిద్రపట్టటంలేదు. అటునుంచి ఇటు, ఇటు నుంచి అటూ ఎన్నిసార్లు పొర్లాడినా నిద్రాదేవత కరుణించటంలేదు. మనస్సులో ఒకటే ఆందోళన, అలజడి, అంతస్సంఘర్షణ. ఒకపక్క తల్లిదండ్రులు, సంప్రదాయం, వంశగౌరవం, మరోపక్క వ్యక్తిగత జీవితం, కలిసి గడపాల్సిన కమనీయ బంధం, రాధకిచ్చిన మాట. ఎటుపోవాలో, ఏంచేయాలో, ఏమైపోవాలో అర్థంకావటంలేదు. పుట్టినప్పట్నించీ నాన్నమాట జవదాటి ఎరుగను. అమ్మ కంట తడిపెట్టించి ఎరుగను. మరి నేడో, చేయి దాటిపోతున్నాడన్న ఆందోళనలో కొడుకు కళ్ళలోకి సూటిగా చూడలేకపోతున్న నాన్న. అనునయంగా ఆప్యాయంగా 'నాన్నమాట కాదనొద్దు' అని అర్థించే తల్లి గద్గద కంఠం. ఇంటి నాక్రమించిన గంభీర వాతావరణాన్ని మరచిపోదామన్నా మరువలేకపోతున్నాను.

'ఒరేయ్ తమ్ముడూ! మా మాట వినరా! వాళ్ళది చాలా సంప్రదాయ సిద్ధమైన కుటుంబం. వాళ్ళు నిత్యాగ్నిహోత్రులు. పైపైని తళుకు బెళుకులు లేకపోయినా ఆ అమ్మాయి పూజా పునస్కారాల్లో పెరిగిన పిల్ల. ఆపిల్ల వచ్చి మనింట్లో దీపం పెడితే మనిల్లు మళ్ళీ కళకళలాడిపోతుంది. బావగారి ఉద్దేశం కూడా ఇదే, అమ్మ ఆలోచనా ఇదే, నాన్న కోరికా ఇదే. ఇంతమందిని కాదంటావా? పైపై మెరుగులు పదికాలాలపాటు నిలవవురా! నా మాట విను.' అని చెవిన ఇల్లుకట్టుకుని పోరే అక్క పలుకులు గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

అసలు జీవితంలో జరగాల్సిన పొరపాటేనాడో జరిగిపోయింది. ఆంధ్రా యూనివర్శిటీలో తెలుగు యెమ్మేలో చేరటమే తన తప్పిదం. హృదయంలో కవిత్వంపట్ల, భావుకత్వంపట్ల విపరీతమైన స్పందన కలిగి ఉండటమే మరో తప్పిదం. ఆ స్పందనలకు ప్రతిగా స్పందించే రాధతో పరిచయం కావటం మరో తప్పిదం. వర్తమానాన్ని భరించలేని మనసు గతంలోకి పారిపోయింది.

'మొన్న కవి సమ్మేళనంలో మీరు వినిపించిన పద్యాలు అద్భుతంగా ఉన్నాయి. మీ భావాలెంత బరువో, మీ పదాలంత సుతిమెత్తన' అభినందించిన రాధ. అదే మా తొలి పరిచయం.

'ఆ పద్యంలో దేవులపల్లి పోకడ ఉంది. ఈ పద్యంలో కరుణశ్రీ నడక ఉంది. ఈ ఖండికలో ఉమర్ ఖయ్యాం వేదాంతముంది.' అంటూ తన ఊహలకూపిరిపోస్తూ, తన భావాలకు నగిషీ చెక్కుతూ, రాధ నా కవిత్వంలోకి, వ్యక్తిత్వంలోకి, జీవితంలోకి చొరబడిపోయింది.

రాధ కళ్ళలోకి చూస్తూ ఎన్నో సాయంత్రాలు గడిపాను. రాధ ఎద పొంగుల్లో విందులు చేసే భావసుందరి వీణా నాదాన్ని అందుకున్నాను. నుదిటిపై తేలాడే రాధ ముంగురుల్లో పసిపాపడిలా కేరింతలు కొట్టాను. శంఖంలాంటి రాధ మెడపై ఆ నల్లని పుట్టుమచ్చ తన హృదయఫలకంపై ఎన్నో ఆలోచనల అచ్చుల్ని పోసింది. మాట్లాడేటప్పుడు, అప్పుడప్పుడు పోట్లాడేటప్పుడు ముందుకెగసే రాధ ముక్కుపుటాలు, ముక్కుకున్న ముక్కెర ఊహల లోకాల్లో తప్పిపోయే తన భావాలకు ముక్కుతాడు వేసి స్థిమితాన్నిచ్చేవి.

రాధ నడుంపైని ముడతల్లోని వత్తిడిలో తన హృదయం సేదతీరేది. ఆ ముడతల ముడుల్లో తన మనసు ఆదమరచి నిద్రపోయేది. రాధతో ఎన్నో సాయంకాలాలు, ఎన్నో ప్రాతఃకాలాలు, కాలాన్ని మరిపించే మరెన్నో వెన్నెల రాత్రులు తన వ్యక్తిత్వానికి కవిత్వానికి పారాణి పెట్టేవి. రాధ చీరె కుచ్చెళ్ళ దొంతర్లలో తాను గంగమ్మతల్లి అలలు పొంగుల్ని చూసాడు. నడిచేటప్పుడు రాధ పిరుదులపై లయతప్పకుండా నాట్యం చేసే జడ తన గుండెల్లో అలజడిని లేపేది. ఇన్ని అనుభూతులు, ఇన్ని [illegible]గాలు, కలవరపెట్టిన రాధ వొంటి వొంపుల్లోని కమనీయ దృశ్యాలు, వలపుల పులకరింతల్ని [illegible] రాధ మనోభావాల సుందర శిల్పాలు, భావ వీధుల్లో కవితల పందిళ్ళు వేసిన రాధ పలుకుల్లోని మెలకువలు, తానెలా మరచిపోగలడు.

మరి అది అదృష్టమో దురదృష్టమోగానీ యెమ్మే కావటంతోనే గుంటూర్లోని ఓ కాలేజీలో తనకు తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం దొరకటం, తెలుగు పంతులుగా తాను గుంటూర్లో స్థిరపడ్డ కొన్ని నెలలకే గుంటూర్లోని బాంక్‌లో రాధ ఎంప్లాయీగా వచ్చి చేరటం గబగబా జరిగిపోయింది. రాధ వాళ్ళ దూరపుచుట్టం ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంది. మరి నేనో ఒక చిన్న పోర్షన్లో అద్దెకుంటూ హోటలు తిండి తింటూ జీవితాన్ని ప్రారంభించాను.

తనకు తన వ్యక్తిత్వానికి, భావుకత్వానికి అనువైన జీవితం దొరికింది. లోకం 'పంతులేకదా, అందులోనూ తెలుగు పంతులేకదా' అని అనుకున్నా, ఆ తెలుగు పంతులు హోదాలో, ఎదుగుతున్న పిల్లలతో మాస్టర్ల సాయంతో తమ తమ సంస్కారాల్నీ, తమ తమ అభిరుచుల్నీ, తమ తమ జీవితాల్నీ సరిదిద్దుకొనే పిల్లల మధ్యలో కాలం ఎంతో హాయిగా గడవసాగింది. సంధుల్నీ, సమాసాల్నీ, ఛందస్సునీ, పాఠం చెప్పేటప్పుడు పిల్లల మనసుల్లోని విసుగుదల ముఖాల్లో కొట్టవచ్చినప్పుడో పద్యం, రోజంతా లెక్కల్లో, సైన్సుల్లో, లాబ్స్‌లో, కామర్సులో, ఎకనామిక్సులో బరువుగా కాలం గడిపి చివరి క్లాసుకి వాలిపోతూ సోలిపోతూ క్లాసుకు వచ్చిన పిల్లల కనుకొనల్లో చోటు చేసుకున్న ఆ భారాన్ని, బరువునూ గమనించినప్పుడో కవిత. అదేం చిత్రమో పిల్లల అలసట, విసుగుదల క్షణాల్లో మాయమైపోయేది. అలసట స్థానంలో తేలియాట, విసుగుదల చోట్లో ఉత్సాహం పద్యాలు పాడేవి. కవితలల్లేవి. ప్యూను ముక్కంటి కొట్టే బెల్లు రణగొణ ధ్వనిలో పిల్లలు కవితాలోకం నుండి క్లాసులోకి, బెంచీలపైకి వచ్చేవారు. తృప్తిగా, ఆనందంగా గలగలా కిలకిలా నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ సైకిళ్ళెక్కి, మోపెళ్ళెక్కి ఈనాటికి తెరవేసిన తెలుగు క్లాసులోని తియ్యదనాన్ని నెమరువేసుకుంటూ కాంపస్ వీడేపిల్లలు. చిలకల పలుకులు, కులుకులు, గోర్వంకల గీర్వాణాలు, ఓహ్ జీవితం హాయిగా గడువసాగింది.

పగలంతా విద్యార్థినీ విద్యార్థుల సున్నితమైన భావాల బంగరు బాటల్లో నడక, సాయంత్రమయ్యే సరికి ఏ పార్కులోనో, ఏ సినిమా హాల్లోనో, రెస్టారెంట్లలోని ఏ ఏసీ రూములోనో రాధ ఎద పలికే బరువైన భావాల గీతాల్లో పడక. ఇదీ జీవితం. జీవితమిలానే సాగిపోతే, కాలమే ఆగిపోతే ఎంత బాగుండేదో!

ఒకరోజు తనకు బాగా గుర్తు. కట్టలు తెంచుకున్న తన భావావేశానికి తలొగ్గిన శరీరం పట్టుతప్పటం.




సున్నితంగా రాధ భుజాలపై చేతులేయటం. వద్దన లేక మిన్నకుండలేక రాధ బరువుగా నిట్టూర్చింది. ఆ నిట్టూర్పే ఊపిరిగా తన చేతులు గోలచేయసాగాయి. అంతులేని ఆవేశం రాధను తన బాహువుల్లో ఇముడ్చుకుంది. కళ్ళకు దృశ్యాలు కనబడటంలేదు. చెవులకు శబ్దాలు వినబడటంలేదు. పంచేంద్రియాలు పనిచేయటం మానేసాయి. శరీరాన్నంతా మనసే ఆక్రమించింది. భావాల్నన్నింటినీ కోరికే ఆవహించింది. వెచ్చని ఉచ్ఛ్వాస నిశ్వాసలు. వొళ్ళంతా సెగలే. అనురాగపు పొగలే. నేనెవరో, నేనేమిటో, రాధెవరో, మా పరిస్థితేమిటో గుర్తించే స్థితిలో లేను. అరవిరిసిన పరువాల పూల రెక్కల్ని విరవటానికి, విరిసీ విరియని మందారంలోని ఆనందాలు తేనెల్ని తాగటానికి తుమ్మెద నాదం చేస్తోంది. మరో ఘడియ గడిస్తే, మరో క్షణం దాటితే ఆవేశం విజ్ఞత వెన్ను విరిచేదే!

పోతున్న ప్రాణానికూపిరిపోసినట్టు, తప్పటడుగులు వేస్తూ పట్టుతప్పి నేలపై పడబోయే పిల్లాణ్ణి తల్లి అక్కున చేర్చుకున్నట్లు ఆకాశం గర్జించింది. ఉరుములతో మెరుపులతో కూడిన వర్షం. 'రమేష్, రమేష్ ఏమిటిది' అన్న స్వరం ఆర్తిగా, ఆత్రంగా, మూలుగులా విన్పించింది. ఒక్కసారి ఈలోకంలోకి వచ్చాను. బాహువుల్లో విలవిల్లాడుతున్న రాధ. ఆవేశాన్ని విజ్ఞత అణగదొక్కింది. సిగ్గుపడ్డాను. తలవంచుకున్నాను. రాధ ఉదాసీనంగా నవ్వింది. 'పద పోదాం' నిర్లిప్తంగా అన్నది. ఆనాడింత జరిగినా రాధ ప్రేమలో, రాధ భావాల్లో మార్పులేదు. కేవలం అది ఉద్రేకపు పొంగుగా రాధ గుర్తించింది. ఆనాటినుంచీ భావాల కౌగిలింతలేకాని, పరువాల పలవరింతలు మా మధ్యలేవు. ఒకరిపట్ల ఒకరికున్న ఆరాధనా భావంలో ఎట్టి మార్పూలేదు. రోజులు వారాలుగా, వారాలు నెలలుగా, రెండు సంవత్సరాలను కాలం తన బాహువుల్లో ఇముడ్చుకున్నది.

ఎదిగిన కొడుకు, సంపాదించే కొడుకు, కాస్తో కూస్తో హోదా ఉన్న కొడుకు ఇంట్లో ఉంటే అందరిళ్ళల్లో వచ్చే పరిణామమే మా ఇంట్లోనూ వచ్చింది. పెళ్ళి చేయాలన్న ఆరాటం నాన్నకు అమ్మకు పెరగసాగింది. అందుకు వంతపాడే పాత్రను సహజంగానే అక్క చేపట్టింది. ఆ పరిణామం యొక్క ఫలితమే ఈనాటి అలజడి, ఆందోళన. సంప్రదాయం, వంశ గౌరవం ఒకవైపు, కులం కాకపోయినా అందాల్నీ, సంస్కారాల్నీ, భావుక లోకాల్నీ అందిపుచ్చుకున్న, మనసిచ్చిన రాధ మరోవైపు. నాన్నను అమ్మను ఒప్పించలేని బలహీనత. రాధను వదులుకోలేని మానసిక దౌర్బల్యం.

ఈ మానసిక సంఘర్షణతో పొర్లి పొర్లి, దొర్లి దొర్లి ఇక నిద్రపట్టదని నిశ్చయించుకున్నాను. సడన్‌గా సౌతాఫ్రికాలోని మొదటి వన్డే మ్యాచ్ గుర్తొచ్చింది. టీవీ ఆన్ చేసాను. ఇండియా ఓడిపోయింది. గంగూలీ, సచిన్ల సెంచరీలు వ్యర్థమైనాయి. ఉన్న బాధలు కాక ఇదో కొత్త బాధ. 'ఛ..' అని విసుక్కున్నాను. వెంటనే

## కష్టానికి ఫలితం!



'కొత్త ఒక వింత, పాత ఒక రోత' అన్న సామెత.. సినీ రంగానికి బాగా వర్తిస్తుంది. ఎప్పటికప్పుడు పాత నీరు పోయి కొత్తనీరు వస్తూనే వుంటుంది ఇక్కడ. హీరోలను ఎంతకాలమైనా చూడగల సహనమున్న మన ప్రేక్షకులు హీరోయిన్లను మాత్రం ఎంతోకాలం చూడలేకపోతున్నారు. కొత్త హీరోయిన్‌ల 'రాక'తో పాత హీరోయిన్‌ల 'పోక' జరుగుతోంది! తెలుగులో ఇప్పుడు కొత్త హీరోయిన్ల ధాటి, ఉధృతి ఎక్కువగా వుండడంతో పాత హీరోయిన్లు క్రమంగా తెలుగుతెరకు దూరమై తమిళ తెరకు దగ్గరవుతున్నారు. అలా తమిళతెరకు దగ్గరైన బ్లాక్‌బ్యూటీ రోజాకు 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిలిం అండ్ టెలివిజన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్'కు డైరెక్టర్ పదవి దక్కింది. తెలుగుదేశం తరఫున ప్రచార కార్యక్రమంలో అహోరాత్రులు కష్టపడినందుకే ఈ పదవి దక్కిందని భాగ్యనగరంలో గుస..గుసలు. ఈ పదవీకాలం రెండేళ్ళు. ప్రస్తుతం తమిళంలో రోజా 'నదిఎంగేపోగిరదు' టి.వి. సీరియల్‌లో, తెలుగులో 'పోలీస్ సిస్టర్స్' చిత్రంలో నటిస్తోంది.

- శ్వేత




అన్పించింది. ఇన్ని బాధల్నిచ్చినా ఆ బాధల్ని తట్టుకోటానికి, నిలదొక్కుకోటానికి కవిత్వాన్నిచ్చాడా భగవంతుడు. ఆ కవితామృత రసపానమే లేకుంటే, చిన్నప్పట్నించీ నాన్న ఎదుర్కొన్న ఆర్థిక దురవస్థ, అమ్మ కష్టం, అక్క పెళ్ళికి అప్పులు, తనను చదివించటానికి నాన్నపడ్డ తిప్పలు, పెళ్ళి పేరుతో నేడీ సంఘర్షణ-- ఈ బాధలకేనాడో కృంగిపోయేవాణ్ణి. వెంటనే ఉత్పలమాలగా పద్యం మొదలైంది. 'ఇచ్చిన బాధలన్ మరువ ఎట్లో కవిత్వమునిచ్చినావు' గబగబా యతిదగ్గర కూడా ఆగకుండా పద్యానిక్కావాల్సిన నాల్గులైన్లలో మొదటి లైను పూర్తయింది. మొదటి లైను చివర్లో ఓ గరువును పారేసి, కొత్త లైన్లో రెండవ అక్షరమైన ప్రాసాక్షరంతో రెండవ లైను ప్రారంభించాలి. డబ్బు దస్కం వైభవం కీర్తి, ఏమిచ్చినా ఇవ్వకున్నా ఇదోటిచ్చాడు భగవంతుడు. పద్యం సాగింది.

'ఏమిచ్చిన ఈయకున్న, అదియే పదివేలుకదయ్య' పద్యం రెండవలైను చివరికొచ్చింది. ఔను ఈ కవిత్వమే భగవంతుడు తనకిచ్చిన పదివేలు. వెనుకటి పదివేలు కాదు. ఈనాటి పదివేలు. పదివేలు పెట్టినా గజం స్థలం దొరకని, డబ్బుకు విలువలేని రోజుల్లోని పదివేలు. ఐనా నేనింతగా వ్యామోహపడుతున్నానే గానీ, ఈ పద్యాల్నీ, భావాల్నీ, కవిత్వాల్నీ మెచ్చుకొనేవాడెవడు ఈరోజుల్లో? మెచ్చుకోటం అటుంచి అసలు వినేదెవరు? రోజూ కలిసి కాలేజీకెళుతున్న నేరానికి అన్యమనస్కంగా వినే ముకుందం, తన ఎక్కౌంట్సుల్లో, ఆడిటింగులలో మునిగితేలుతూ 'విన కపోతే ఏమనుకుంటాడో', 'పోనీ ఎలాగోలా విని ఈ సుత్తెను వదిలించుకుంటే పోలా' అని మనసులో అనుకొంటూ వినే లక్ష్మణ్రావు. అబ్బ డిపార్ట్‌మెంట్‌లోకి రాగానే మొదలైందని దాదాపుగా అంటూనే, తెలుగు లిటరేచర్ లెక్చరర్లమై కొంచెమైనా పద్యం పట్ల ఆసక్తి చూపకపోతే బాగుండదేమోననీ, విని, విన్న తర్వాత బాగుందనకపోతే బాగుండదని 'బాగుంది బాగుంది' అనే తోటి లెక్చెరర్లూ-- ఇవేకదా ఈ కవిత్వానికి దక్కేది, దక్కింది. ఔను అంతే. పద్యం సాగింది. 'ఇంతకున్ మెచ్చినవారు లేరు'. పద్యం మూడోలైన్లోకి ప్రవేశించింది. ఔనూ తన పద్యాలకు మెచ్చుకోలు దక్కకపోవటానికి కారణమేమై ఉంటుంది? నా పద్యాలు బాగోలేక పోవటమా? కాదు కాదు, ఎన్నటికీ కాదు. మరి కారణమేమై ఉంటుంది? కారణం తోచింది. పద్యం సాగింది. 'పుడమిన్ మనసన్నది మృగ్యమాయె' ఐతే ఏం చేద్దాం. నీ నెత్తిన కాకిరెట్ట పడిందంటే అన్నవాణ్ణే కాస్త తీసెయ్యకూడదూ అన్నట్లు, పద్యాల్లో వ్రాసే చాతుర్యాన్నీ, కవితలల్లే భావుకత్వాన్నీ ఇచ్చిన ఆ పరమేశ్వరుణ్ణే మెచ్చుకోమంటేపోలా? ఎలాగూ ఎదురుగా లేడు, విసుక్కోడు. ఆయనైనా నిజంగా మెచ్చుకుంటాడా? పోనీ మిగతావారిలాగానే పైపైకన్నా మెచ్చుకోమందాం. పైపైకి మెచ్చుకున్నా, లోలోపల మెచ్చుకున్నా అతడు పరమేశ్వరుడుకదా! ఈ భావంతో పద్యం పూర్తయింది. 'ఈ పిచ్చిని నీవునైన మెరమెచ్చులకైనను మెచ్చవా శివా!'

నిద్రపోతే పోయిందిగానీ అందమైన పద్యం వచ్చింది. కాకిపిల్ల కాకికి ముద్దు. 'ఇచ్చిన బాధలన్ మరువ ఎట్లాకవిత్వమునిచ్చినావు, ఏమిచ్చిన ఈయకున్న, అదియే పదివేలు కదయ్య, ఇంతకున్ మెచ్చినవారు లేరు, పుడమిన్ మనసన్నది మృగ్యమాయె. ఈ పిచ్చిని నీవునైన మెరమెచ్చులకైనను మెచ్చవా శివా!' తిరిగి చదివేటప్పుడర్థమైంది. చివరి లైన్లో యతి తప్పిందని. 'పిచ్చి' శబ్దంలోని 'పి' అక్షరానికి 'మెచ్చుల' శబ్దంలోని 'మె' అక్షరానికి యతి చెల్లదు. పెద్దలొప్పుకోరు. ఇది సంప్రదాయం కాదు. పోనీ 'మురిపెమ్మునకైనను' అంటే-- ఆ, యతి ఇప్పుడు సరిపోయింది. కానీ తన మనసొప్పటం లేదు. మెరమెచ్చులన్నది భావుక ప్రయోగం. మురిపెమ్మున కన్నది సంప్రదాయం కోసం పెద్దల కోసం చేసుకున్న సర్దుపాటు మాత్రమే. సంప్రదాయం కోసం భావాన్నీ హృదయాన్నీ బలిపెట్టాలా? హృదయం కోసం సంప్రదాయాన్నొదులుకోవాలా? ఒక పక్క సంప్రదాయ సిద్ధమైన ఛాందస్సుందరి. మరోవంక మనసుకు నచ్చిన భావసుందరి. ఇద్దర్నీ పొందటమెలా? ఒకరికోసం మరొకర్ని వదులుకోక తప్పదు. అలా వదులుకోకపోతే ఏకపత్నీవ్రతుణ్ణి కాలేను. కొద్ది నిముషాలాలోచించాను. మెరమెచ్చుల్నే ఉంచాలనిపించింది. సంప్రదాయం కోసం హృదయాన్ని చంపుకోలేను. ఎందుకో ఉన్నట్టుండి అనిపించింది. పద్యంలో, ఛందస్సుందరితో, భావసుందరితో కలిసి కాపురం చేయాలి. ఎవ్వర్నీ మెప్పించలేక ఇరుకున పడాలి. గేయమైతే, కాపురం ఒక్క భావసుందరితోనే. ఏకపత్నీ వ్రతానికి భంగంరాదు. ఔను ఛందస్సనే సంకెళ్ళనుండి స్వేచ్ఛను పొందాలి. ఇకనుంచీ గేయాలే వ్రాయాలి. భావసుందరికి మాత్రమే తన జీవితాన్నంకితం చేయాలి. మనస్సెందుకో శాంతించింది. కళ్ళు మూతలుపడ్డాయి. మెల్లగా నిద్రలోకి జారిపోయాను.

తెల్లవారి నిద్రలేస్తూనే నిశ్చయ భావంతో బాగ్ సర్దుకున్నాను. కాలేజీకి లీవ్ లెటర్ పంపాను. ఇంటికి వెళ్ళి నాన్నకు అమ్మకు చెప్పాలి. తాత్కాలికంగా వాళ్ళు కోపగించుకున్నాసరే- 'సంప్రదాయంకోసం హృదయాన్ని, స్పందనను వదులుకోలేనని చెప్పాలి. రాధసాన్నిహిత్యం విడువలేనని నిక్కచ్చిగా చెప్పాలి' ఔను ఇక నుంచీ గేయాల్నే వ్రాస్తాను. వడి వడిగా అడుగులు బస్‌స్టాండు వైపుకు సాగిపోయాయి. ★